

# ఇదినిజం

RNI Regd.No: APTEL/2012/45871

సాయంకాలం దినపత్రిక

పొట్టిశ్రీరాములు నెల్లూరు | సంపుటి : 19 సంచిక: 220 | ఎడిటర్: మాదాల వెంకటశేషగిరి | సోమవారం 20, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02




# ఆశనిరాశల.. అధినేత్రి!

మహిళా రిజర్వేషన్ బిల్లు మరోసారి పార్లమెంటులో వీగిపోయింది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలనే ఆలోచనతో పార్టీలు అన్నీ ఏకీభవిస్తున్నట్లు ప్రకటిస్తున్నా, బిల్లు సభలోకి వచ్చే సరికి రాజకీయ కారణాలతో విభేదిస్తున్నాయి. దీంతో ఏళ్లు గడుస్తున్నా, మహిళా రిజర్వేషన్ చట్టం సాకారం కావడం లేదని అంటున్నారు. నిజానికి మహిళా రిజర్వేషన్ అంశాన్ని మన రాజ్యాంగం రూపొందించిన సమయంలోనే ఆలోచన చేశారు. కానీ ఆచరణ సాధ్యపడలేదు. అలా మొదట్లోనే బ్రేక్ పడిన మహిళా రిజర్వేషన్ అంశం 78 ఏళ్లు కావస్తున్నా ఆచరణలోకి రావడం లేదు.

(ఇదినిజం ప్రతినిధి):

## చట్ట సభల్లో దక్కని చాన్స్

| | | | |
|---|---|---|---|
| దాగుడు మూతలు ఆడుతున్న లీడర్లు | మూడు దశాబ్దాలుగా అతివకు కన్నీళ్లే | పార్టీల రాజకీయ క్రీడలో మగ్గుతున్న మగువ | రిజర్వేషన్ అంటూ తాయిలం |
| ఏళ్లు గడుస్తున్నా అందని ఫలం | వాజ్ పేయి నుంచి మోదీ వరకు ఇదే కథ | మన్మోహన్ హయాంలోనూ బిల్లుకు గ్రహణం | |

### మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్ బిల్లు లింకు పెట్టడంతో..

మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్ బిల్లుకు లింకు పెట్టడంతోనే కేంద్ర ప్రతిపాదన పట్టాలెక్కలేదని విశ్లేషిస్తున్నారు. అయితే మహిళా రిజర్వేషన్ల కోసం ఎప్పుడూ ఏదో ఒక ఆటంకం కలుగుతుండటమే రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగ రచన సమయంలోనే చట్టాన్ని ఆమోదించలేకపోయిన తర్వాత 1996లో దేవెగౌడ ప్రధానిగా ఉండగా మళ్లీ తెరపైకి తెచ్చారు. అప్పట్లో 13 పార్టీలతో కూడిన యునైటెడ్ ఫ్రంట్ సంకీర్ణ ప్రభుత్వంలో పలు పార్టీల నేతలు సుముఖంగా లేకపోవడంతో సభలో గందరగోళం నెలకొని బిల్లు ఆమోదం పొందలేకపోయింది. ఓబీసీ ప్రాతినిధ్యం లేకపోవడమే సమస్య అప్పుడే మహిళా బిల్లు సమీక్షించడానికి సీపీఐ నాయకురాలు గీతా ముఖర్జీ నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. ఈ కమిటీ బిల్లును అధ్యయనం చేసి 'చట్టసభల్లో మహిళలకు దాదాపు మూడో వంతు రిజర్వేషన్' అనే పదం బదులుగా మూడో వంతుకు తగ్గకుండా రిజర్వేషన్ అనే పదం చేర్చాలని సూచించింది. అదేవిధంగా రాజ్యసభలో కూడా ఇవ్వాలని, ఓబీసీలకూ ప్రాతినిధ్యం ఇవ్వాలని పేర్కొంది. వీటిని చేర్చి కొత్త బిల్లు తీసుకువచ్చినా 1996లో ఏకాభిప్రాయం సాధించలేకపోయారు. బిల్లులో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఉన్నట్లే ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని సూచనలతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

### మళ్లీ వర్షా కాల సమావేశాల్లో బిల్లు?

ఇక తాజాగా మహిళా రిజర్వేషన్ చట్టం చేస్తున్నట్లు గత గురువారం రాత్రి కేంద్రం ప్రకటించింది. గెజిట్ కూడా విడుదల చేసింది. అయితే సభలో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంతో రిజర్వేషన్ల అమలు ప్రక్రియ నిలిచిపోయినట్లే అంటున్నారు. అయితే కేంద్రం విడుదల చేసిన గెజిట్‌ను అమలు చేయాలంటే ఆరు నెలల సమయంలో ఎప్పుడైనా చట్టం చేయొచ్చునని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు. దీంతో వచ్చే పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో బిల్లును మళ్లీ ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోందని చెబుతున్నారు. దీంతో 30 ఏళ్ల చరిత్రను తిరగరాసేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం చాలా పట్టుదల ప్రదర్శిస్తోందని చెబుతున్నారు.

### మన్మోహన్ హయాంలోనూ..

ఇదే క్రమంలో వాజపేయి తర్వాత ప్రధానిగా పీఠమెక్కిన మన్మోహన్ సింగ్ కూడా మహిళా రిజర్వేషన్ తీసుకురావాలని ప్రయత్నించారు. 2004లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిలోనే ఈ దిశగా అడుగులు వేసినా, ఆర్జేడీ తదితర భాగస్వామ్య పక్షాల అభ్యంతరాలతో అమలు సాధ్యం కాలేదు. 2008లో మన్మోహన్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం మరోమారు ప్రయత్నించినా ఫలించలేదు. 2010లో రాజ్యసభలో ఆమోదం పొందినా లోక్ సభ ఆమోద ముద్ర పడలేదు.

### వాజపేయి నుంచి మోదీ వరకు..

ఇక 1998 నుంచి 2004 వరకూ కొనసాగిన వాజపేయి సారథ్యంలోని ఎన్డీఏ సర్కారు హయాంలో మహిళా బిల్లు ఆమోదం కోసం పలు ప్రయత్నాలు జరిగాయి. 1998 జూలై 13న లోక్ సభలో న్యాయశాఖ మంత్రి తంబిదురై మహిళా బిల్లును ప్రవేశపెట్టినప్పుడు లాలూ ప్రసాద్ యాదవ్ సారథ్యంలోని ఆర్జేడీ, ములాయంసింగ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్ వాదీ పార్టీ సభ్యులు తీవ్ర గందరగోళం సృష్టించారు. ఓబీసీ కోటా లేకుండా మహిళా బిల్లును ఆమోదించే ప్రశ్నేలేదని తేల్చిచెప్పారు. అదే ఏడాది డిసెంబరులో బిల్లు తెచ్చే ప్రయత్నాలను లోక్ సభలో మమతా బెనర్జీ గట్టిగా అడ్డుకున్నారు. బీఎస్పీ, ముస్లింలీగ్ తదితర పార్టీలు కూడా బిల్లును సమర్థించలేదు. పాలకపక్షంలోని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కూడా విభేదించినట్లు గుర్తుచేస్తున్నారు. ఇక వాజ్ పేయి రెండోసారి ప్రధాని అయ్యాక 1999లో మరోసారి బిల్లును తీసుకురాగా, ఎస్పీ, బీఎస్పీ, ఆర్జేడీ సభ్యులు గట్టిగా వ్యతిరేకించారు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా వాజపేయి 2000, 2002, 2003 ఏడాదిల్లో కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో వాజపేయి ప్రభుత్వం మహిళా బిల్లును ముందుకు తెచ్చే ప్రయత్నాలు చేశారు. కానీ సఫలం కాలేదని వ్యాఖ్యానిస్తున్నారు.

### చట్టం అమలు అసాధ్యమా?


ఇక ప్రధాని మోదీ సారథ్యంలో 2023లో కొత్త పార్లమెంటు భవనంలో ప్రత్యేక సమావేశాలు జరిపి మహిళా బిల్లును ప్రవేశపెట్టారు. నారీ శక్తి వందన్ అభియాన్ పేరిట పలు సవరణలతో తీసుకువచ్చిన ఈ బిల్లుకు లోక్ సభ, రాజ్యసభ ఆమోద ముద్ర వేశాయి. రాష్ట్రపతి ఆమోదంతో మహిళా బిల్లు తొలిసారిగా చట్టరూపం దాల్చింది. అయితే దీంట్లో ఉన్న సవరణల ప్రకారం 2026లో నిర్వహించే జనగణన అనంతరం నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే ఈ చట్టం అమలు అవుతుందని నిబంధన చేర్చారు. అయితే దీనికి సవరణలు చేసి తాజాగా పార్లమెంటులో ప్రవేశపెట్టారు. 2026 జనాభా లెక్కలకు బదులుగా 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు నియోజకవర్గాల పునర్విభజన చేయాలని నిర్ణయించారు. ఈ రెండు అంశాలకు లింకు పెట్టడంతోనే విపక్షాలు వ్యతిరేకించాయని అంటున్నారు. దీంతో 30 ఏళ్ల తర్వాత కూడా మహిళా రిజర్వేషన్ అమలుకు దారులు పడలేదని వ్యాఖ్యానిస్తున్నారు

## మహిళా రిజర్వేషన్‌ను అడ్డుకున్న టీఎంసీని శిక్షించండి: మోదీ పిలుపు



బిష్ణుపూర్:(ఇదినిజం ప్రతినిధి): లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోవడంతో విపక్షాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శల దాడి కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ కుమ్మక్కై దిగువసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఓడించిందని, ఇందువల్ల మహిళలకు జరగాల్సిన న్యాయం జరగలేదని విమర్శించారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిష్ణుపూర్‌లో ఆదివారంనాడు జరిగిన ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, వికసిత్ భారత్ కలల సాకారం, దేశాభివృద్ధికి భారత రాజకీయాల్లో మహిళలకు మరింత భాగస్వామ్యం కల్పించాలని కేంద్రం కోరుకుంటోందని అన్నారు. అయితే బెంగాల్ తల్లులు, చెల్లెళ్లను టీఎంసీ వంచించిందని ఆరోపించారు. ప్రజలను నిరంతరం దోచుకోవడమే కాకుండా బెంగాల్ మహిళలకు దక్కాల్సిన హక్కులను టీఎంసీ దక్కనీయడం లేదని తప్పుపట్టారు. 'బెంగాల్ మహిళలు 33 శాతం రిజర్వేషన్ కోరుతున్నారు. ఇందుకు నేను భరోసా కూడా ఇచ్చాను. 2029 నుంచే రిజర్వేషన్ అమలు చేయాలని మహిళల కోరికగా ఉంది. అందుకోసం మేము ప్రయత్నాలు సాగించాం. అయితే తమ మహా జంగిల్ రాజ్‌ను సవాలు చేస్తారనే కారణంగా మరింత మంది మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలు కావడానికి టీఎంసీ ఇష్టపడటం లేదు. 33 శాతం రిజర్వేషన్ మహిళలకు దక్కకుండా కాంగ్రెస్‌తో కలిసి టీఎంసీ కుట్రపూరితంగా అడ్డుకుంది' అని ప్రధాని విమర్శలు గుప్పించారు.

## దేవాలయాల పుష్కరిణుల్లో నీటిని నింపేందుకు యాక్షన్ ప్లాన్: చంద్రబాబు..



అమరావతి: (ఇదినిజం ప్రతినిధి): జలధార– జలహారతి కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను నోడల్ అధికారిగా సీఎం చంద్రబాబు నాయుడు నియమించారు. ఈ విషయాన్ని జలధార కార్యక్రమం అమలుపై జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని మండలస్థాయి నోడల్ అధికారి నుంచి రాష్ట్రస్థాయి నోడల్ అధికారి వరకూ సవాల్‌గా తీసుకుని పని చేయాలని ఆదేశించారు. జలధార– జలహారతి కార్యక్రమంపై సీఎం చంద్రబాబు సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పనులను ఆయనకు అధికారులు వివరించగా.. పలు కీలక విషయాలపై వారికి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..'జలధారకు సంబంధించి ప్రతీ మండల నోడల్ ఆఫీసర్లు కీలకంగా వ్యవహరించాలి. అర్బన్ మండలాల్లోనూ నోడల్ అధికారులు పటిష్ఠంగా పర్యవేక్షించాలి. నీటి సంరక్షణ– నీటి భద్రత విషయంలో అన్నమయ్య జిల్లా మోడల్ రాష్ట్రవ్యాప్తంగా అమలు కావాలి. జలధార కార్యక్రమాన్ని సవాల్‌గా తీసుకుని పనిచేయాలి. భారీ వర్షాలు పడినా నీటి ముంపు లేకుండా ఉండేలా కాల్వలు, చెరువుల మరమ్మతులు చేపట్టాలి. వర్షాకాలంలో చెరువులన్నీ నింపేలా చర్యలు తీసుకోవాలి. పశ్చిమ గోదావరి జిల్లాలో డ్రైనేజీలను బాగు చేసే అంశంపైనా ఫోకస్ పెట్టాలి. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ భారం తగ్గుతుంది.. విద్యుత్ భారం తగ్గితే వేరే కార్యక్రమాలకు ఆ నిధులను వినియోగించుకోవచ్చు. ఏపీలో వివిధ దేవాలయాల్లో ఉన్న పుష్కరిణులకు నీటి లభ్యత కల్పించేలా జలధార కార్యక్రమం చేపట్టాలి. దేవాలయాల పుష్కరిణుల్లో నీటిని నింపేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి. జలధార– జలహారతిలో ప్రజల్ని భాగస్వాములను చేయాలి. జలధార పనుల ప్రభావం ఏ మేరకు ఉంటుందో విశ్లేషించాలి' అని ఆదేశించారు.

## ఆ సమయంలో నేను ఉండటం గొప్ప భావోద్వేగ సందర్భం: నారా లోకేశ్



అమరావతి, ఏప్రిల్ 19: (ఇదినిజం ప్రతినిధి):అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే చిన్నారికి రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్‌ను మంత్రి నారా లోకేశ్ సమకూర్చిన సంగతి తెలిసిందే. పునర్విక ప్రాణాలు కాపాడేందుకు రూ.16 కోట్లు విలువ చేసే ఇంజెక్షన్ ఇచ్చే సమయంలో తాను ఉండటం గొప్ప భావోద్వేగ సందర్భమని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. అలానే ఈ ఘటనతో ప్రేరణ పొందిన ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు.అరుదైన వ్యాధులపై సమగ్ర దృష్టితో 'ప్రాజెక్ట్ పునర్విక' చేపట్టబోతున్నట్లు ప్రకటించారు. అరుదైన జన్యు వ్యాధులతో బాధపడే పునర్విక లాంటి పిల్లల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్ట్‌కు సాయం చేసేందుకు వీలుగా ప్రయత్నాలు చేస్తామన్నారు. అత్యంత ఖరీదైన చికిత్సల ఖర్చు తగ్గించేలా..అంతర్జాతీయ ఔషధ సంస్థలతో భాగస్వామ్యానికి ప్రణాళికలు వేస్తున్నట్లు వెల్లడించారు. వైద్యులు, నిపుణులతో కలిసి దీర్ఘకాలిక పరిష్కారాల కోసం అన్వేషించాలని ఆయన కోరారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న పునర్విక అనే చిన్నారికి ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరం కాగా.. దాతలు స్పందించి రూ.10 కోట్లు మేర సమకూర్చారు. చిన్నారి తల్లిదండ్రులు 'ఎక్స్'లో చేసిన అభ్యర్థనకు మంత్రి నారా లోకేశ్ స్పందించారు. మిగిలిన రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని ఆ కుటుంబానికి ఫిబ్రవరిలో లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు విదేశాల నుంచి జోల్ జెన్ స్మా ఇంజెక్షన్‌ను లోకేశ్ తెప్పించగా.. ఆయన సమక్షంలోనే హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో వైద్యులు శనివారం పునర్వికకు ఇంజెక్షన్ చేశారు.

## కేసుల భయంతో బానిసలా బతుకాలా..?.

### సోదరుడు జగన్‌పై వైఎస్ షర్మిల విమర్శలు

అమరావతి, ఏప్రిల్ 19: (ఇదినిజం ప్రతినిధి):దత్తపుత్రుడు జగన్ తెర తొలగిందని, బీజేపీతో పెట్టుకున్న అక్రమ పొత్తు తేటతెల్లమైందని ఆయన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విపక్షం ముసుగులో ఉన్న వైఎస్సార్సీపీ సైతం ఆర్ఎస్ఎస్ పక్షమేనని నిజ నిర్ధారణ జరిగిందని అన్నారు. బిల్లులను అడ్డుకున్న ప్రతిపక్ష పార్టీలు ఏం సాధించాయి..? అని వైసీపీ అధినేత జగన్ ప్రశ్నించడంపై ఆమె స్పందించారు. టీడీపీ, జనసేనలను మించి మోదీని ఇంతలా మోయాలా..? మన దేశ రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే ముఖ్యమా..? అని ప్రశ్నించారు.అక్రమ డీ లిమిటేషన్ బిల్లుపై ఎన్డీఏ పక్షాన నిలబడ్డందుకు జగన్ సిగ్గుపడాలని షర్మిల అన్నారు. ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి కోసం ఇంతలా బీజేపీతో అంటకాగాలా..? కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా..? బీజేపీ బిల్లులకు గొర్రెలా, గుడ్డిగా తలాడించాలా..? మోదీ మెప్పు కోసం సొంత కాకిలెక్కలు అల్లాలా..? అని నిలదీశారు. ఇదేనా తమరు చెప్పే వైఎస్ఆర్ ఆశయాలు, వారసత్వం..? అని ప్రశ్నించారు. మహానేత సిద్ధాంతాలను మంటగలిపినందుకు, విలువలకు తూట్లు పొడిచినందుకు ఆత్మవిమర్శ చేసుకోవాలి అన్నారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే అక్రమ బిల్లులకు విపక్షాలు అడ్డుపడి విజయం సాధిస్తే... ఏం సాధించారని ప్రశ్నించడం హాస్యాస్పదమని, కోట్లాది మంది రాష్ట్ర ప్రజల గుండెలు గాయపరచడమే మీ గొప్పతనమా అని నిలదీశారు.



దక్షిణాది రాష్ట్రాల భావోద్వేగాన్ని అర్థం చేసుకోకపోవడమా మీ రాజకీయం..? అన్నారు. ప్రతిపక్షంగా విపక్షానికి మద్దతు ఇవ్వాల్సిందిపోయి అధికార పక్షానికి జై కొట్టడం ప్రపంచంలో ఎక్కడైనా ఉందా..? అని ప్రశ్నించారు. జగన్.. మీరు చేసిన నీచపు పనికి వైఎస్ ఆత్మ నిజంగా ఘోషిస్తోంది అన్నారు.

RNI Regd.No: APTEL/2012/45871

సాయంకాలం దినపత్రిక

# సంపాదకీయం

**సోమవారం 20, ఏప్రిల్2026**

## తల వంచక శ్రమించు!

జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులేనా? విజయానికి ఇవే కొలమానాలా? గొప్పగొప్ప వాళ్లంతా పెద్దపెద్ద చదువులు చదివినవారేనా? పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లేనా? ఆత్మహత్యలే శరణ్యమా? ...కానేకాదు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. చదువంటే విజ్ఞానం. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పే జ్ఞాననేత్రం. అయితే, నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం మానవీయతకు విరుద్ధం. ‘పిల్లల ఆలోచనలను బంధించకండి, అవి వికసించాలి’ అంటారు టాగూర్. కానీ మనం పిల్లల వికాసాన్ని అడ్డుకుంటున్నాం. మానసిక ఒత్తిడిని పెంచుతున్నాం. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాలను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్సహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదిమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తెలంగాణలో ఒక్కరోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల వార్తలు మనం చూస్తూనే వున్నాం. రోటి దెబ్బ, రోకటి దెబ్బ అన్నట్లుగా మారింది విద్యార్థుల పరిస్థితి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాల ప్రతిబింబం. సుప్రీంకోర్టు సైతం ‘ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం’ అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థైర్యాన్నివ్వడం ముఖ్యం. ‘గుండెల్లో మంట వుంది/ అది నిన్ను దహించేది కాదు/ నీ గమ్యాన్ని వెలిగించేది కావాలి’ అంటారో కవి. చిన్నా... మార్కులు, ర్యాంకుల కోసమే నువ్వు పుట్టలేదు. ఫెయిలైతే మళ్లీ చదువు... మళ్లీ చదువు. అసలు చదువే ఇష్టం లేకపోతే... నీకు అభిరుచి వున్న మరో రంగంలో నీ సత్తా చాటు. ఎవరో ఏదో అంటారనో, అనుకుంటారనో నిన్ను నీవు శిక్షించుకోకు. జీవితమంటేనే పోరాటం. పోరాడు... విజయం సాధించు. అంతేగాని ఓటమి నిన్ను పలకరించిందని నిరాశ చెందకు. ”ఫెయిల్’ అంటే– నేర్చుకోవడంలో మొదటి ప్రయత్నం’ అంటారు అబ్దుల్ కలాం. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. మందబుద్ధి గల విద్యార్థిగా ముద్రపడిన ఐన్‌స్టీన్ గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగాడు. చదువులో రాణించలేకపోయిన కమల్‌హాసన్... నటనలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రపంచ గుర్తింపు పొందాడు. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ప్రపంచ కుబేరుల్లో ఒకరైన ధీరూబారు అంబానీ 16 ఏళ్ల వయసులోనే క్లర్క్‌గా జీవితం ప్రారంభించాడు. వీరే కాదు, స్టీవ్‌జాబ్స్, బిల్‌గేట్స్, అబ్రహాం లింకన్, వాల్ట్ డిస్నీ వంటి ఏ ఒక్కరి జీవితమూ ఉన్నత చదువులతో ప్రారంభం కాలేదు. వీరంతా తమకు నచ్చిన, అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలించితే... భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. నీ శ్రమతో కొత్త చరిత్రను లిఖించు. ఓటమి నిన్ను పలకరిస్తే.. నవ్వుతూ సాగనంపు, గెలుపు నీ ముంగిట తలవంచే వరకూ విశ్రమించక శ్రమించు.

## “తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలు, కూల్చివేతల, పాలన మధ్య : ఆందోళనలో ప్రజలు”

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అధికార మార్పు జరిగే ప్రతిసారి “కొత్త ప్రభుత్వం వచ్చింది, కొత్త దిశ మొదలైంది” అనే ఆశ కలుగుతుంది. కానీ కొద్ది కాలానికే ప్రజలలో మరో ప్రశ్న మొదలవుతుంది– –పాలన మారిందా, లేక కేవలం పాలకులే మారారా? ఆంధ్రప్రదేశ్‌లో ఆస్తుల వినియోగం, ప్రైవేట్ భాగస్వామ్యాలు, సంక్షేమ ప్రాధాన్యతలపై చర్చ నడుస్తుంటే, తెలంగాణలో భూసంరక్షణ, అక్రమ నిర్మాణాల తొలగింపు, కూల్చివేతల విధానంపై తీవ్ర వాదోపవాదాలు కనిపిస్తున్నాయి. ఈ రెండు రాష్ట్రాల పరిస్థితులు వేర్వేరు అయినా, కేంద్ర ప్రశ్న మాత్రం ఒక్కటే: ప్రభుత్వ నిర్ణయాల మధ్య ప్రజల ప్రయోజనం నిజంగా కేంద్రబిందువా ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, ఫిషింగ్ హార్బర్లు, పోర్టులు, పర్యాటక ప్రాజెక్టులు, భూముల వినియోగం వంటి అంశాలు రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. గత ప్రభుత్వ కాలంలో కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల విస్తరణకు పెద్ద ఎత్తున ప్రణాళికలు రూపొందించబడ్డాయి. రాష్ట్రంలో వైద్య విద్యా అవకాశాలు పెంచడం, జిల్లా స్థాయిలో ఆరోగ్య సేవలు విస్తరించడం అనే ఉద్దేశం స్పష్టంగా కనిపించింది. ఇటీవల పిడుగురాళ్ల మెడికల్ కళాశాలకు 520 పోస్టుల మంజూరు వంటి చర్యలు ఆ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని సూచిస్తున్నాయి. అయితే మరోవైపు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో ప్రభుత్వం మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో ప్రైవేట్ భాగస్వామ్యానికి మొగ్గుచూపుతోంది. ఇది తప్పనిసరి ఆర్థిక వ్యూహమా, లేక ప్రజా ఆస్తులపై వెనుకడుగా అన్న ప్రశ్న సహజం. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, టూరిజం ఆస్తులు ప్రైవేట్ రంగానికి ఇవ్వడం ద్వారా వేగవంతమైన పెట్టుబడులు రావచ్చు, ఉపాధి అవకాశాలు పెరగవచ్చు. కానీ సరైన నియంత్రణ లేకపోతే ప్రజల కోసం నిర్మించిన మౌలిక వసతులు కొద్దిమందికే లాభదాయమయ్యే ప్రమాదం ఉంది. జువ్వలదిన్నె హార్బర్ వంటి అంశాలపై వచ్చిన రాజకీయ విమర్శలు ఇదే సందేహాన్ని ప్రతిబింస్తున్నాయి. ఇక్కడ అసలు సమస్య “ప్రైవేటీకరణ” కాదు; “ప్రజా ప్రయోజన భద్రత” లేకపోవడమే. ఒక ప్రభుత్వ ఆసుపత్రి లేదా కళాశాలపై ప్రైవేట్ నిర్వహణ వస్తే ఫీజులు పెరుగుతాయా? స్థానికులకు సేవలు తగ్గుతాయా? మత్స్యకార హార్బర్‌ను వ్యాపార కేంద్రంగా మార్చితే సంప్రదాయ వృత్తులపై ప్రభావమేమిటి? ఈ ప్రశ్నలకు పారదర్శక సమాధానాలు లేకపోతే ప్రజలు అమ్మకాల ప్రభుత్వమనే భావనకు రావడం సహజం. తెలంగాణలో దృశ్యం వేరుగా ఉంది. ఇక్కడ ప్రభుత్వం నగరాభివృద్ధి, ప్రభుత్వ భూముల సంరక్షణ, చెరువులు–నాలాల పరిరక్షణ పేరిట “హైడ్రా” వంటి సంస్థల ద్వారా భారీ స్థాయిలో కూల్చివేతలు చేపడుతోంది. హైదరాబాద్‌లో వందల సంఖ్యలో ఆక్రమణల తొలగింపు చర్యలు జరిగాయని నివేదికలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రహదారులు, పార్కులు, నీటి మార్గాలు తిరిగి ప్రజలకు అందుబాటులోకి రావడం సానుకూల అంశమే. కానీ చట్టబద్ధ ప్రక్రియ, ముందస్తు నోటీసు, పునరావాసం, బాధితుల హక్కులు వంటి అంశాల్లో తీవ్ర ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి. తెలంగాణ హైకోర్టు ఇటీవల “హైడ్రా” చర్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, స్పష్టమైన న్యాయా లేకుండా కూల్చివేతలు చేయవద్దని ఆదేశించింది. ప్రజా భూముల రక్షణ అవసరమే అయినా, అది “యుద్ధ వాతావరణం”లా ఉండకూడదని కోర్టు వ్యాఖ్యానించింది. ఇది ప్రజాస్వామ్యంలో చాలా కీలక సందేశం. అక్రమ నిర్మాణం తొలగించాల్సిందే. కానీ అక్రమానికి అనుమతి ఇచ్చిన అధికారులు? రిజిస్ట్రేషన్ చేసిన వ్యవస్థ? రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు? వీరిపై చర్యలు లేకుండా చివరికి కేవలం ఇంటి యజమానిపైనే బుల్డోజర్ నడిస్తే, అది న్యాయం కంటే ప్రదర్శనగా కనిపించే ప్రమాదం ఉంది. ఈ రెండు రాష్ట్రాల మధ్య పోలిక ఆసక్తికరం. ఆంధ్రప్రదేశ్‌లో “ఆస్తులను ఎలా వినియోగించాలి?” అన్న చర్చ ప్రధానంగా ఉంటే, తెలంగాణలో “భూమిని ఎవరి నుండి తిరిగి తెచ్చుకోవాలి?” అన్న చర్చ ప్రధానంగా ఉంది. ఒక రాష్ట్రం పెట్టుబడుల కోసం ప్రభుత్వ ఆస్తులను తెరుస్తుంటే, మరో రాష్ట్రం భూవినియోగ క్రమశిక్షణ కోసం కఠిన చర్యలకు దిగుతోంది. రెండింటికీ సిద్ధాంతపరంగా కారణాలు ఉన్నాయి. కానీ రెండింటిలోనూ ప్రజల విశ్వాసం దెబ్బతినే అవకాశం కూడా ఉంది. సంక్షేమం మాత్రమే సరిపోదు; ఆదాయం సృష్టించే ఆర్థిక వ్యూహం కావాలి. అదే విధంగా క్రమశిక్షణ మాత్రమే సరిపోదు; మానవీయతతో కూడిన అమలు కావాలి. ఆసుపత్రి అమ్మి ఆదాయం తెచ్చినా ప్రజలకు చికిత్స దొరకకపోతే ప్రయోజనం లేదు. అక్రమ నిర్మాణం కూల్చినా నిరపరాధ కుటుంబం రోడ్డున పడితే అది పాలనా విజయం కాదు. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అసలు లోటు నాయకుల కొరత కాదు; స్థిరమైన పాలనా తత్వం కొరత. ఒక ప్రభుత్వం వచ్చిన వెంటనే పాతదాన్ని రద్దు చేయడం, కొత్తది వచ్చిన వెంటనే ప్రతీకారాత్మక నిర్ణయాలు తీసుకోవడం, ప్రజల దీర్ఘకాల ప్రయోజనాల కంటే రాజకీయ సందేశాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఇదే సమస్య. ప్రజలకు కావలసింది అమ్మకాల ప్రభుత్వం కాదు, కూల్చివేతల ప్రభుత్వం కాదు. అవకాశాలు కల్పించే ప్రభుత్వం, చట్టాన్ని న్యాయంగా అమలు చేసే ప్రభుత్వం, ప్రజా ఆస్తిని కాపాడుతూ ప్రజ జీవితాలను కూడా గౌరవించే ప్రభుత్వం. తెలుగు రాష్ట్రాల అదృష్టం మారాలంటే, అధికార మార్పు కంటే పాలనా నాణ్యత మారాలి.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**

## మెగా ఫుడ్ పార్కులను ఏర్పాటు చేసి ఆహార వృథాను అరికట్టాలి

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ . పెరుగుతున్న పునర్వినియోగపరచలేని ఆదాయం ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్ వృద్ధికి ఆజ్యం పోసింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారులలో భారతదేశం ఒకటి. ప్రపంచంలో భారతదేశం పాల ఉత్పత్తిలో మొదటి స్థానంలో, పండ్లు, కూరగాయలు, చేపల ఉత్పత్తిలో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమకు ముడి పదార్థాల వనరులు దేశంలో సమృద్ధిగా ఉన్నాయి. అయినప్పటికీ, ప్రాసెసింగ్ సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు సాంకేతికత లేకపోవడం వల్ల దేశంలో సహజ ఉత్పత్తులు 2–5% కంటే తక్కువ ప్రాసెస్ చేయబడుతున్నాయి. సరైన ప్రాసెసింగ్ విధానం లేనప్పుడు వ్యవసాయ ఉత్పత్తులు దాదాపు 25–30 శాతం వృధా అవుతుందని అంచనా వేయబడింది. దేశంలో పాడైపోయే ఉత్పత్తులలో ఏడు శాతం మాత్రమే ప్రాసెస్ చేయబడుతున్నాయి, యుఎస్ లో 65 శాతం, ఫిలిప్పీన్స్ 78 శాతం, చైనా 23 శాతం వంటి దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ సామర్థ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గ్రహించాలి, ప్రభుత్వం ఈ రంగం వృద్ధిని ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చెప్పటాల్సిన అవసరం ఉంది. దీనిని అధిగమించడానికి, ఆహార ప్రాసెసింగ్ రంగాన్ని అభివృద్ధి చేయడం అవసరం, ఎందుకంటే పాడైపోయే వ్యవసాయ ఉత్పత్తుల జీవితకాలం పెంచడం, విలువ జోడింపు ప్రోత్సహించడం భవిష్యత్తులో వ్యవసాయ రంగాన్ని సజీవంగా ఉంచుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, భారత ప్రభుత్వం 2008 సంవత్సరంలో ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖ ద్వారా మెగా ఫుడ్ పార్క్ పథకాన్ని అమలు చేసింది, అది రైతులు, ప్రాసెసర్లు రిటైలర్లను ఒకచోట చేర్చి వ్యవసాయ ఉత్పత్తిని మార్కెట్‌కు అనుసంధానించడానికి ఒక యంత్రాంగాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది, తద్వారా వృధాను తగ్గించడం, గ్రామీణ రంగంలో రైతుల ఆదాయాన్ని పెంచడం ఉపాధి అవకాశాలను సృష్టించడం. ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధి చేయడానికి క్లస్టర్ విధానంపై ఆధారపడి ఉంటుంది. మెగా ఫుడ్ పార్క్ అంటే పొలం నుంచి మార్కెట్ వరకు విలువ గొలుసు వెంట ఆహార ప్రాసెసింగ్ కోసం ఆధునిక మౌలిక సదుపాయాలను అందించడం. మెగా ఫుడ్ పార్కులు క్లస్టర్ ఆధారిత విధానం ద్వారా పొలం నుంచి మార్కెట్ వరకు విలువ గొలుసు వెంట ఆహార ప్రాసెసింగ్ కోసం ఆధునిక మౌలిక సదుపాయాలను సృష్టిస్తాయి. సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌లో సాధారణ సౌకర్యాలు ఎనేబుల్ మౌలిక సదుపాయాలు సృష్టించబడతాయి, ప్రాథమిక ప్రాసెసింగ్ నిల్వ కోసం సౌకర్యాలు పొలం దగ్గర ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, సేకరణ కేంద్రాలు రూపంలో సృష్టించబడతాయి. ఈ పథకం కింద, భారత ప్రభుత్వం ప్రతి మెగా ఫుడ్ పార్క్ ప్రాజెక్టుకు రూ. 50 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందిస్తుంది. సేకరణ కేంద్రాలు వ్యక్తిగత రైతులు, రైతు సంఘాలు స్వయం సహాయక బృందాల నుండి ఉత్పత్తులను సమీకరించే కేంద్రాలుగా పనిచేస్తాయి. అవి ముడి పదార్థాలను ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలకు అందిస్తాయి. సేకరణ కేంద్రాలు స్థానిక వ్యవస్థాపకులు నిర్వహిస్తారు. ఇవి 10 కిలోమీటర్ల వ్యాసార్థంలో ఉన్న ప్రక్కనే ఉన్న ప్రాంతాలకు వ్యవసాయ స్థాయి సమీకరణ కేంద్రాలుగా పనిచేస్తాయి. ఈ సీసీ లు గ్రామీణ వాణిజ్య కేంద్రాలుగా ఉద్భవించి, ఆ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తాయి. ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు పీపీసీలు ప్రాథమిక నిర్వహణ కేంద్రాలను కలిగి ఉంటాయి, ఇవి సీపీసీలో మరింత ప్రాసెస్ చేయడానికి ముడి పదార్థాలను ఉపయోగిస్తాయి. పీపీసీ సమీపంలో అనేక సీసీ లకు సేవలు అందిస్తుంది. కొన్ని పీపీసీలు పల్పింగ్, జ్యూసింగ్ మొదలైన వాటితో సహా ఇంటి లోపల సౌకర్యాలను కలిగి ఉంటాయి. సాధ్యమైనంత తక్కువ సమయంలో సీపీసీకి పదార్థాన్ని రవాణా చేయడానికి రిఫ్రిజిరేటర్ వ్యాన్లు, ట్రక్కులు వంటి సౌకర్యాలను కలిగి ఉంటాయి. సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఒక పారిశ్రామిక పార్క్ మరియు వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యంలోని అనేక ప్రాసెసింగ్ యూనిట్లను కలిగి ఉంది. ఇక్కడ, అభివృద్ధి చెందిన భూమిని పెద్ద మరియు మధ్య తరహా యూనిట్లకు అందించబడుతుంది, కామన్ డిజైన్ ఫ్యాక్టరీ షెడ్లను చిన్న తరహా యూనిట్లకు అందిస్తారు. ఈ పార్క్ నీరు, విద్యుత్ మరియు మురుగునీటి శుద్ధి వంటి సాధారణ సౌకర్యాలను అందిస్తుంది, అంతేకాకుండా ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు మరియు సేకరణ కేంద్రాల నెట్‌వర్క్ ద్వారా కోల్డ్ స్టోరేజ్, వేర్ హౌసింగ్, లాజిస్టిక్స్ మరియు బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్ వంటి ప్రత్యేక సౌకర్యాలను అందిస్తుంది. వ్యవసాయం మన భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, 70 శాతం కంటే ఎక్కువ గ్రామీణ కుటుంబాలు తమ జీవనోపాధి కోసం వ్యవసాయం అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నాయి. ప్రస్తుత దృష్టాంతంలో, జీడీపీకి వ్యవసాయ రంగం యొక్క సహకారం క్రమంగా తగ్గుతోంది.

భారతదేశ వ్యవసాయ రంగంలో, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమను ఈ రంగం విస్తరణకు అవసరమైన వృద్ధికి ఇంజిన్‌గా చూస్తారు. వ్యవసాయ రంగం నాలుగు శాతం వృద్ధి ప్రమాణాన్ని అధిగమించడానికి, దేశంలో పెరుగుతున్న జనాభా యొక్క పెరుగుతున్న ఆహార డిమాండ్లను తీర్చడానికి ఆహార ప్రాసెసింగ్ రంగం రెండంకెల రేటుతో అభివృద్ధి చెందాలి. దేశంలో మొత్తం ఆహార ఉత్పత్తి రాబోయే దశాబ్దంలో రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. అయినప్పటికీ ప్రస్తుతం అంతర్జాతీయ ఆహార వాణిజ్యంలో దేశం 1.5 శాతం కంటే తక్కువగా ఉంది, ప్రాసెసింగ్ సౌకర్యాలు లేకపోవడం అంటే దాదాపు యుఎస్ 10 బిలియన్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులలో 35 శాతం వృధా అవుతోంది. ఈ నేపథ్యంలోనే రైతులు వ్యాపారుల మధ్య కీలకమైన సంబంధాన్ని అందించడానికి ఫుడ్ పార్కులు ఒక అవసరంగా మారాయి. దేశంలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక బిలియన్ వినియోగదారుల దేశీయ మార్కెట్‌ను ఉపయోగించుకోలేదని అధ్యయనాలు చెబుతున్నాయి అందువల్ల ప్రభుత్వ కొత్త వాణిజ్య విధానంలో ప్రాధాన్యతా రంగం హోదా పొందాల్సిన అవసరం ఉంది.

**డా. ముచ్చుకోట. సురేష్ బాబు**

## సీబీఎన్... ఆ పేరే ఒక బ్రాండ్!

చంద్రబాబు నాయుడు ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. ఆయనను అర్థం చేసుకోవడం అంటే కేవలం రాజకీయాలను అర్థం చేసుకోవడం కాదు, భవిష్యత్తును ఎలా నిర్మించాలో తెలుసుకోవడం. సాధారణ నాయకులు కాలానికి అనుగుణంగా మారుతారు, కానీ అరుదైన నాయకులు కాలాన్నే మార్చేస్తారు. ఈ కోవకు చెందినవారే చంద్రబాబు. ఆయన నిర్ణయాలు ఈ రోజుకే పరిమితం కావు, రాబోయే తరాల భవిష్యత్తును నిర్మించే దిశగా సాగుతాయి. ఆయన రాజకీయంగా ఎదిగిన విధానం, సాధారణంగా కనిపించే ప్రయాణం కాదు. అది అడుగడుగునా సవాళ్లతో కూడిన ఒక దీర్ఘకాలిక సాధన. ప్రజలతో మమేకమై, పరిపాలనను వారికి చేరువ చేశారు. ప్రతి అంశాన్ని డేటాతో అర్థం చేసుకునే అలవాటు ఆయనను ఒక ప్రత్యేక నాయకుడిగా తీర్చిదిద్దింది. నిర్ణయం తీసుకునే ముందు సమాచారం సేకరణ పద్ధతిని ఆయన అలవాటు చేసుకున్నారు. ఇది తర్వాత ఆయన పాలనలో కనిపించే రియల్ టైమ్ గవర్నెన్స్‌కు పునాది అయింది. 1995లో ఆయన మొదటిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు, ఆంధ్రప్రదేశ్ ఒక క్లిష్ట పరిస్థితిలో ఉంది. ఆర్థిక లోటు, పరిపాలనా నిర్వీర్యం, అభివృద్ధి లోపం రాష్ట్రాన్ని వెనక్కి లాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన చేపట్టిన చర్యలు కేవలం పాలనా నిర్ణయాలుగా కాకుండా, స్టేట్ రీకన్‌స్ట్రక్షన్ మిషన్‌గా మారాయి. ప్రభుత్వ వ్యయ నియంత్రణ, వనరుల సమర్థ వినియోగం, పారదర్శకతపై దృష్టి వంటి అంశాల ద్వారా రాష్ట్రాన్ని ఒక క్రమబద్ధమైన అభివృద్ధి మార్గంలో నడిపించారు. వరల్డ్ బ్యాంక్‌తో కలిసి అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు దీర్ఘకాలంలో రాష్ట్రానికి బలమైన ఆర్థిక పునాది వేశాయి. హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చడం ఆయన దూరదృష్టికి ఒక ప్రతీక. బిల్ గేట్స్‌ను అప్పట్లో ఇక్కడికి తీసుకురావడం, హైటెక్ సిటీని నిర్మించడం, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించడం ద్వారా ఆయన ఉమ్మడి రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల పటంలో నిలిపారు. ఇది ఒక ఆర్థిక వ్యూహకర్తగా ఆయనను నిలబెట్టింది. ఆయన రూపొందించిన విజన్ 2020, భారతదేశంలో అభివృద్ధి ప్రణాళికలకు ఒక మార్గదర్శకంగా నిలిచింది. అదే విధంగా కేంద్ర రాజకీయాల్లో కూడా ఆయన ప్రభావం గణనీయంగా ఉంది. రాజధాని కూడా లేకుండా విభజించిన సమయంలో అందరి చూపు ఆయనపైనే. ఆయన వస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది, అభివృద్ధి చెందుతుందని 2014లో టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపించారు. ఆ ఐదేళ్లు అభివృద్ధి విషయంలో ఆయన చేసిన కృషి అనేక స్థాయిల్లో కనిపిస్తుంది.

**బి.సి. జనార్దన్‌రెడ్డి**



## అన్ని దానాలలో కెల్లా రక్త దానం గొప్పది.

**చెందోడులో ఎమ్.వి. రావు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2,750 వ రక్తదాన శిబిరం**




కోట. (ఇది నిజం ప్రతినిధి )అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారికీ ప్రాణ బిక్ష పెట్టాలని ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పువరపు లీలా మోహన్ కృష్ణ కోరారు. ఆదివారం కోట మండలం చెందోడు గ్రామంలో గత 18 సంవత్సరాలుగా 2,750 వ రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గూడూరు మెడిపల్స్ రక్తనిధి కేంద్రం వారు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ముందుగా స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు శ్రీమతి ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజలవన చేశారు. అనంతరం రక్తదాతలు నుంచి రక్తాన్ని సేకరించి వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.వి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పువరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి రక్తదాతలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే " ప్రజా దర్బార్" కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ**




సూళ్లూరుపేట. (ఇది నిజం ప్రతినిధి ) తిరుపతి జిల్లాసూళ్లూరుపేట నియోజకవర్గం, సూళ్లూరుపేటలో ఈరోజు ఆదివారం "ప్రజా దర్బార్ "కార్యక్రమం ఏర్పాటు చేయడం జరి గింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉ మ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజా సమస్యల కొరకే నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తె లియ జేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రం 10 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రస్తుత ఉమ్మడి కూటమి ప్రభుత్వంపై అధిక భారం పడిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తన వద్దకే తీసుకురావాలని, నియోజకవర్గంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్ , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి,ఉమ్మడి కూటమి నాయకులు కార్యకర్తల్లో పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా జన్మదిన వేడుకలు..

నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):కుటుంబ సభ్యుల ఆనందాల హేళి మధ్య నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నగరంలోని విపిఆర్ నివాసంలో కేకు ఏర్పాటు చేసిన కుమారుడు అర్జున్ రెడ్డి దంపతులు, కుమార్తె నీలిమ, మనుమళ్లు, మనుమరాళ్లు, కుటుంబ సభ్యుల సందడి వాతావరణంలో కేక్ కట్ చేశారు.




## ఐ సి ఎస్ రోడ్డు, కూరగాయలు మార్కెట్ ఏరియాలో "ఉచిత సలివేంద్ర మినరల్ వాటర్," ఏర్పాటు

గూడూరు. (ఇది నిజం ప్రతినిధి ) ఎస్ పి ఎస్ ఆర్ నెల్లూరు జిల్లా, గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కీ.శే.శ్రీ కొండూరు సుబ్రహ్మణ్యం గారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో ×జూ రోడ్డులో కూరగాయల మార్కెట్ పక్కన 9-04-2026ఆదివారం ఉదయం 10: 30 గంటలకు ప్రముఖ వైద్యురాలు లిడాక్టర్ రోహిణమ్మ గారు ముఖ్య అతిథులుగా భారీ " ఉచిత చలివేంద్రం మినరల్ వాటర్"1000 మందికి మజ్జిగ, గుగ్గిళ్ళు, పులిహోర అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ విదేశాల్లో ఉండి కూడా వారి తండ్రి గారి మీద ఉన్న ప్రేమతో ప్రతి సంవత్సరం ఈ చలివేంద్రం నిర్వహిస్తున్న కీర్తిశేషులు శ్రీ కొండూరు సుబ్రహ్మణ్యం గారి కుటుంబ సభ్యులు ఎంతో అభినందనీయులని అన్నారు. అలాగే ప్రతి ఏడాది కూడా మంచి మనసున్న సేవా దృక్పథం కలిగిన శ్రీమతి డాక్టర్ రోహిణమ్మగారి చేతుల మీదుగానే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ప్రగతి సేవా సంస్థకు శుభప్రదంగా భావిస్తున్నామని పనుల ఒత్తిడి ఉన్నప్పటికీ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీమతి డాక్టర్ రోహిణి గారు మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ మీద సమాజంలో మంచి నమ్మకం ఉండబట్టే దాతలు అంతా ఈ సంస్థ ద్వారానే కార్యక్రమాలు నిర్వహించడానికి మొగ్గు చూపుతున్నారని , ప్రగతి సేవా సంస్థ నిర్వహించే ప్రతి కార్యక్రమానికి కుటుంబసభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని మరెన్నో మంచి కార్యక్రమాల ద్వారా ప్రగతి సేవా సంస్థ ముందుకెళ్లాలని ఆశిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కొండూరు హరిబాబు ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు మిత్రులు మరియు తదితరులు పాల్గొన్నారు.







## అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం...

ఏఎస్ పేట (ఇది నిజం ప్రతినిధి హరికృష్ణ)ఏ ఎస్ పేట (రహమదాబాద్) దర్గా ప్రాంగణం నందు ప్రఖ్యాత కంటి వైద్య ఆసుపత్రి వాసన్ ఐ కేర్ అనే జాతీయస్థాయి పేరు ప్రఖ్యాతలు కలిగిన సంస్థ సహకారంతో అత్యంత నైపుణ్యం కలిగిన వారి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో, ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు వంద మందికి పైగా వ్యక్తులు హాజరై కంటి వైద్య సేవలు పొందారు. ఎక్కువ మందికి కంటి అద్దములు రాయడం జరిగింది. కొంతమంది వ్యక్తులకు కంటిలో శుక్లాలు ఉండడం వలన వారికి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో వారిని వాసన్ ఐ కేర్ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రత్యేక పరీక్షలు నిర్వహింపజేసి, శస్త్ర చికిత్స కొరకు ఏర్పాటు చేయడమైనది.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజలు అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ వారు చేస్తున్న ఉచిత సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వారి తరఫున వాసన్ ఐ కేర్ డాక్టర్ రవికుమార్, పి ఆర్ ఓ రమేష్ , సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ కృష్ణ నరేష్ , అల్ హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ అధ్యక్షులు మొహమ్మద్ హసన్ బేగ్, సంస్థ సభ్యులు షేక్ మహబూబ్ బాషా, ఏఎస్ పేట దర్గా ఈవో ఎస్.కె. ఎండి హుస్సేన్, ఎస్ డి. కాలేషా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేము హరిబాబు, వ్యాపారవేత్త రెహమాన్, పఠాన్ సంధాని ఖాన్ తదితరులు పాల్గొన్నారు...






## రక్తదానంతో మరొకరికి పునర్జన్మ

**- నా పుట్టిన రోజున సామాజిన సేవా కార్యక్రమం నిర్వహించడం సంతోషకరం**
**- జిపిఆర్ కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ప్రారంభించిన వేమిరెడ్డి దంపతులు.**

నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు జి.పి.ఆర్ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు రక్తదాన శిబిర నిర్వాహకులు గుడి హరికుమార్ రెడ్డి ని అభినందించారు. రక్తదానం చేసినవారిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా నా పుట్టిన రోజున ఆడంబరాలకు దూరంగా.. హరికుమార్‌రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. క్యాంప్‌లో పాల్గొన్న నారాయణ బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్, నోవా, ప్రభుత్వ ఆసుపత్రివారికి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం అనేది ప్రాణాన్ని కాపాడే గొప్ప కార్యం. మనం ఇచ్చే రక్తం.. మరో ముగ్గురి జీవితాన్ని నిలబెడుతుందన్నారు. గత సంవత్సరం ఇదే రోజున తన పుట్టిన రోజున జరిగిన బ్లడ్ క్యాంపులో దాదాపు 1500 యూనిట్లు రక్తదానం చేశారన్నారు. అవి కొన్ని నెలల వరకు ప్రజలకు ఉపయోగపడ్డాయని చెప్పారు. ఇప్పుడు కూడా దాదాపు 750 యూనిట్లు సేకరించనున్నారని చెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ దాతలిచ్చే ఒక బాటిల్ రక్తం ప్రమాద బాధితులకు, ప్రసవ సమయంలో తల్లులకు, తలాసీమియా మరియు క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారులకు కొత్త జీవితాన్ని ఇస్తుందన్నారు. రక్తదానం చేస్తే బలహీనపడతామనేది అపోహ మాత్రమేనని రక్తం ఇచ్చిన వెంటనే శరీరం కొత్త రక్త కణాలను వేగంగా ఉత్పత్తి చేస్తుంది, దీనివల్ల దాతలు మరింత చురుగ్గా మారుతారన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పైగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. నోవా బ్లడ్ బ్యాంక్, రెడ్ క్రాస్ మరియు జి.జి.హెచ్ బ్లడ్ బ్యాంక్ బృందాలు రక్త సేకరణలో పాల్గొన్నాయి.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు మరియు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు రక్తదాతలను ప్రత్యేక్షంగా కలిసి, వారిని అభినందించారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు గుడి హరికుమార్ రెడ్డి గారిని ప్రత్యేకంగా ప్రశంసించారు.





## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ -- సత్ప్రవర్తనకు మారాలని సూచించిన పోలీసులు.



తిరుపతి (ఇది నిజం ప్రతినిధి )తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహణ.రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్లకు పిలిపించి వ్యక్తిగతంగా కౌన్సిలింగ్ ఇచ్చారు .అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కఠినంగా సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నిరంతర నిఘా.పునరావృతంగా నేరాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు.జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించి కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా గుర్తించిన రౌడీషీటర్లను ఆయా పోలీస్ స్టేషన్లకు పిలిపించి, వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో సవివరంగా సూచనలు చేశారు.ఈ సందర్భంగా పోలీసులు రౌడీషీటర్లకు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. నేరాలకు పాల్పడడం వల్ల వారి భవిష్యత్తు మాత్రమే కాకుండా కుటుంబాలపై కూడా ప్రతికూల పరిస్థితులు రాకుండా ప్రేమతో జీవించాలని తెలియజేశారు.

## విపిఆర్ కార్యాలయంలో ఎంపీని కలిసిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్...



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శు భాకాంక్షలు తెలియ జేశారు. నగరంలోని విపిఆర్ కా ర్యాలయంలో ఎం పీని కలిసిన ఆయన.. ఈ సందర్భంగా ఎంపీని, ఎమ్మెల్యే ప్రశాంతమ్మను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శు భాకాంక్షలు తెలిపారు.

## ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గారు..!



నెల్లూరు ఏప్రిల్ 19(ఇదినిజం ప్రతినిధి ):గౌరవ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జన్మదిన సందర్భంగా, గౌరవ ఉ దయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సేవలు, ప్రజల పట్ల ఉన్న అంకితభావం, నాయకత్వ లక్షణాలను కొనియాడుతూ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.అలాగే, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండిన దీర్ఘాయుష్షుతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, భవిష్యత్తులో మరింత ప్రజాహితం చేసే కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగించాలని ఆ భగవంతున్ని కోరుకున్నారు.అలాగే కోవూరు నియోజకవర్గ శాసన సభ్యురాలు శ్రీ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా ఎన్నికైన శుభ సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారు వారిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు



# నేడు (సోమవారం) ముఖ్యమంత్రి జన్మదినోత్సవం సందర్భంగా ఆత్మకూరులో విస్తృతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాల పంపిణీకి ఏర్పాట్లు

**సీఎం చంద్రబాబు దీర్ఘాయుష్షు కోసం మంత్రి ఆనం ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు**





ఆత్మకూరు, ఏప్రిల్ 20: (ఇదినిజం ప్రతినిధి ):గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఆత్మకూరు నియోజకవర్గంలో పలు శాఖల ఆధ్వర్యంలో విస్తృతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆత్మకూరు నెల్లూరు పాలెం సమీపంలోని ఏఎంసీ ప్రాంగణంలో సీఎం 76వ జన్మదిన వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం చంద్రబాబు నాయుడు సంపూర్ణ ఆయుష్షు కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆయుష్షు హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేపథ్యంలో, పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజలకు అందించేందుకు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో 23 మహిళా పొదుపు సంఘాలకు రూ.4.40 కోట్ల బ్యాంకు లింకేజి రుణాల జంబో చెక్కును అందజేయనున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు కుట్టు యంత్రాలు పంపిణీ చేయడంతో పాటు, గర్భిణులకు సీమంతాలు ఘనంగా నిర్వహించేలా అంగన్వాడీ అధికారులు సిద్ధమయ్యారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పట్టాదారు పాస్‌బుక్స్, పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారు. ఐ=ఐూ ద్వారా 158 మంది వీఓఏలకు మొబైల్ ఫోన్లు అందజేయగున్నారు. మంత్రి ఆనం సొంత నిధులతో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులకు ట్రాక్‌సూట్లు పంపిణీ చేస్తారు. రవాణా శాఖ ద్వారా వికలాంగులకు డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయనున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 6 మంది లబ్ధిదారులకు రూ.2,72,698 విలువైన జవీ=ఖీ చెక్కులు పంపిణీ చేయడంతో పాటు, ప్రమాదంలో మరణించిన టీడీపీ కుటుంబ సభ్యునికి చెందిన మర్రిపాడు మండలం భీమవరం గ్రామ కుటుంబానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మంత్రి ఆనం చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా దేవాదాయ శాఖ ద్వారా వివిధ పథకాల కింద ఆలయాల నిర్మాణాలకు, ధూప దీప నైవేద్యం ద్వారా ఆలయాలకు నిధులు మంజూరు పత్రాలు మంత్రి ఆనం పంపిణీ చేయనున్నారు.



## విపిఆర్ పుట్టిన రోజున మహిళా సాధికారతకు పెద్దపీట

**– కోవూరు మహిళలకు కుట్టు మిషన్లను, తోపుడు బండ్ల పంపిణి**
**– స్వయం ఉపాధితో కుటుంబాలకు ఊతం**
**– హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు.. విపిఆర్ చల్లగా ఉండాలని ఆకాంక్ష**

నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలోనూ, సమాజ సేవలోనూ తమదైన ముద్ర వేసిన వేమిరెడ్డి దంపతులు మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నెల్లూరు నగరంలోని విపిఆర్ గారి నూతన క్యాంప్ కార్యాలయంలో భారీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళకు స్వయం ఉపాధి కల్పించే దిశగా వేమిరెడ్డి దంపతులు ఈ వేడుకలను మహిళా సాధికారతకు వేదికగా మార్చారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని 110 మంది మహిళలకు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్లను అందజేశారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే 17 మంది పేదలకు తోపుడు బండ్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గార్ల చేతుల మీదుగా అందచేశారు. నిరుపేదల కష్టాలను గుర్తించి వారి కాళ్ళ మీద వారు నిలబడేలా ఉపాధి కల్పించిన వేమిరెడ్డి దంపతులకు కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు అందుకున్న లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియచేసారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనసారా ఆశీర్వదించారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా జన్మదిన వేడుకలను నిర్వహించడమే కాకుండా మహిళా సాధికారతే లక్ష్యంగా తమ దాతృత్వాన్ని చాటుకున్న వేమిరెడ్డి దంపతుల సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.



## షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన పూరిల్లు నిరుపేద దంపతుల కష్టార్జితం అగ్నికి ఆహుతి.

**అనంతవాయువులో పాడి పశువుల కల నగదు, బంగారం**
**కాలి పోవడంతో రోడ్డున పడ్డ అనిల్ కుమార్ కుటుంబం**

సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి పెళ్లకూరు మండలం ఇది నిజం ప్రతినిధి : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం మండలం లోని నంది మాల గిరిజన కాలనీకి చెందిన సాగి అనిల్ కుమార్ వరలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు అయితే తేదీ 19.04.2026 దీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక నిరుపేద కుటుంబం సర్వస్వం కోల్పోయిన విషాద ఘటన పెళ్లకూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నందిమాల గిరిజన కాలనీకి చెందిన సాగి అనిల్ కుమార్, వరలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం గడుపుతున్న సమయంలో. కళ్ళముందే కాలిపోయిన కష్టార్జితం జీవనోపాధి కోసం పాడి పశువులను కొనుగోలు చేయాలని ఈ దంపతులు ఎంతో కష్టపడి రూ. 3 లక్షల నగదును దాచుకున్నారు. దాంతో పాటు ఇంట్లో ఉన్న 20 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి, మరియు నిత్యావసర వస్తువులను భద్రపరుచుకున్నారు. అయితే, ఊహించని విధంగా జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల వారి పూరిల్లు అగ్నిప్రమాదానికి గురైంది. మంటలు వేగంగా వ్యాపించడంతో ఇంట్లోని నగదు, నగలు, వస్తు సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఏడాది కాలంగా కూడబెట్టిన సంపాదన క్షణాల్లో కళ్ళముందే బూడిద కావడంతో ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉన్న ఇల్లు పోయి, చేతిలో చిల్లిగవ్వ లేక ఆ గిరిజన కుటుంబం ప్రస్తుతం రోడ్డున పడింది. ప్రభుత్వం మరియు దాతలు స్పందించి తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.



## జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకున్న బిజెపి కిసాన్ మోర్చా జిల్లా నాయకులు.



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని ఆదివారం భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా కుటుంబ సభ్యులు అమ్మ వారిని దర్శించుకున్న బిజెపి కిసాన్ మోర్చానెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులుశ్రీ వేకపాటి మాల్యాద్రి నాయుడు మరియు,పార్లపల్లి వెంకట మహేష్ నాయుడు కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన , కార్యదర్శి జొన్నవాడ దేవస్థాన ట్రస్ట్ బోర్డు మెంబర్ శ్రీ కీలుకుప్ప. శ్రీనివాసులు యాదవ్ ఆలయ మర్యాదలతో దర్శన భాగ్యాన్ని కలిగించినారు. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు. శ్రీనివాస యాదవ్ అమ్మవారి ఆశీస్సులతో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని మనసారా కోరుకుంటున్నారు



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట పట్టణంలోని ఈరోజు జరిగిన కార్యక్రమంలో తేదీ 19.04.2026 దీన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం సూళ్లూరుపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా దర్బార్' నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం రూపొందించిన 'విజన్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం డా.నెలవల విజయశ్రీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 42 అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూ,మున్సిపల్,విద్యుత్ సంక్షేమ పథకాలకు సంబంధించిన అర్జీలను ప్రజలు ఎమ్మెల్యే కు సమర్పించారు. స్వీకరించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖాధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎటువంటి జాప్యం లేకుండా నిర్ణీత కాలపరిమితిలో సమస్యలను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వ్యయ ప్రయాసలకోర్చి వస్తుంటారని,వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.



## అత్యంత వైభవంగా వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవం





నందిగామ ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి): పట్ట ణంలోని నెహ్రూ నగర్ లో వెంచేసి ఉన్నశ్రీదేవి భూ దేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం ఆ దివారం వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం నం దు వేదమంత్రాల మధ్య అశేష జనవాహిని నడు మ అత్యంత వైభవంగా కనుల పండుగగా కమనీ యంగా స్వామివారి కళ్యాణం జరిగినది. ఈ కళ్యా ణంలో రాప్ స్టార్స్ వారి ఆధ్వర్యంలో కల్యాణానికి వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేయడం జరిగిన ది. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు మరియు స్వామివారి అన్న ప్రసాద వితరణ చేయడం జరిగి నది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేసినా రు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నక రికంటి విశ్వేశ్వరరావు, నరేష్, పెద్దమళ్ళ వీరబా బు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే మొండి తోక జగ న్మోహనరావు



నందిగామ ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి):గుడి మె ట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నా వర పు సుబ్బయ్య మనమరాలి అన్నప్రాసన కార్య క్ర మం పల్నాడు జిల్లా మాదిపాడు గ్రామంలోని అడి వుప్పలమ్మ దేవస్థానం నందు జరిగింది. ఈ కార్యక్ర మంలో నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు , పార్టీ నాయకులతో కలిసి పాల్గొని చిన్నారి ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఉప్పల్‌లో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




ఉప్పల్, ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి):సామాజిక సేవలో ముందుండే మధుర చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ఆదివారం ఉప్పల్ రింగ్ రోడ్‌లోని కరెంట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి ప్రజలకు చల్లని తాగునీరు అందించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మధుర చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 25 సంవత్సరాలుగా ఉప్పల్ నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఉ ప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు చింతల నరసింహారెడ్డి, పిల్లి నాగరాజ్, పంగ మహేందర్ రెడ్డి, రజిత రెడ్డి మధుర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నల్లచెరువు పునరుద్ధరణచేపట్టిన ఎమ్మెల్యే సౌమ్య



చందర్లపాడు ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి):ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం యొక్క ప్రతిష్టాత్మక 'స్వచ్ఛ ఆంధ్ర -- స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శనివా రం చందర్లపాడు మండలం బొబ్బిళ్ళపాడు గ్రామం లోని నల్లచెరువులో తూటికాడ నిర్మూలన పను లను చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా, జల ధార -- జలహారతి అంశంపై దృష్టి సారించి చెరువు పునరుద్ధరణకు ముఖ్యమైన అడుగులు వేయడం జరిగింది. ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య స్వ యంగా స్థలాన్ని సందర్శించి, చెరువులోని తూటి కాడను తొలగించే పనులను ప్రారంభించారు. ఇది స్థానిక నీటి వనరుల సంరక్షణ మరియు పర్యావ రణ పరిరక్షణకు ఉదాహరణగా నిలుస్తుంది. జల ధార -- జలహారతి కార్యక్రమంలో కీలక ఆదేశాలు అదే సందర్భంలో జలధార జలహారతి కార్యక్రమం ఆధ్వర్యంలో బొబ్బిళ్ళపాడు నల్లచెరువులో కింది పనులు చేపట్టడానికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. చెరువు పూడికతీత పనులు, చెరువు గట్టు బలపరచుట, చెరువు గట్టుపై చెట్ల నాటుటజలవ నరుల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారు మరియు చందర్లపాడు మండలం ఎంపీడీఓ ఉపా ధి హామీ సిబ్బందికి అంచనాలు తయారు చేయవ లసిందిగా సూచించారు. ఈ పనులు ఉపాధి హామీ నిధులతో అనుసంధానం చేసి వేగంగా పూర్తి చే యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా స్థాని క రైతులకు సాగునీరు అందుబాటు పెరగడంతోపా టు, భూగర్భ జలాలు పునరుద్ధరణ, పర్యావరణ సమతుల్యం కావడం జరుగుతుందని అధికారులు వ్యక్తం చేశారు.

స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల్లో భాగంగా నీటి వనరుల సంరక్షణను ప్రజా ఉద్య మంగా మార్చాలనే సంకల్పంతో ఈ చర్యలు చేపట్ట డం గమనార్హం. ఈ కార్యక్రమంలో లాల్ బహు దూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు , ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నేతలు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉ పాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఘనంగా కవిత్వ వ్యాస సంపుటి ఆవిష్కరణ






సికింద్రాబాద్, ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి): సికి ంద్రాబాద్‌లోని ప్యారడైజ్ పీజీ కళాశాలలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో ఎం.ఏ తెలుగు విద్యార్థుల వీడ్కోలు వేడుక ఆదివారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రచించిన కవితలు, వ్యాసాలతో రూపొందించిన 'మా ఊరు జీవన స్వరం' కవిత్వ-- వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూనివర్సిటీ తెలుగు విభాగాధ్యక్షులు ఆచార్య ఎన్. రజని సంపుటిని ఆవిష్కరించగా, ముఖ్య అతిథిగా హాజరైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ విశ్వవి ద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగాధ్యక్షులు ఆచార్య ఆకుమర్తి నాగేశ్వరరావు తొలి ప్రతిని స్వీకరించారు. ప్రత్యేక అతిథిగా తెలుగు వన్ ఛానల్ సీఈఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఎన్. రజని మాట్లాడుతూ తెలుగు విభాగంలో ఎం.ఏ విద్యార్థులు తమ స్వీయ రచనలతో ఇప్పటివరకు నాలుగు సంపుటాలను వెలువరించడం వారి సృజనాత్మకతకు నిదర్శనమని అభినందించారు. 'అమ్మంటే', 'నాన్న కోసం', 'జ్ఞాన భాస్కరుడు గురువు' వంటి గత సంకలనాల అనంతరం, ఈసారి తమ పుట్టిన ఊరిని స్మరించుకుంటూ రూపొందించిన 'మా ఊరు జీవన స్వరం' ప్రత్యేకతను ఆమె వివరించా రు. ఆచార్య ఆకుమర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలు అనుబంధాల నిలయాలని, మారుతున్న కాలంలో గ్రామీణ జీవనశైలిలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అలాంటి సందర్భంలో ఊరిని కవిత్వంగా, వ్యాసాల రూపంలో నిలుపుకోవడం విద్యార్థుల మంచి ప్రయత్నమని ప్రశంసించారు. కార్యక్రమానికి డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, సంపుటి రూపకల్పన సమన్వయకర్త డాక్టర్ సుధాకర్ భట్టు మాట్లాడుతూ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను సాహిత్య రూపంలో మలచి పుస్తకంగా తీసుకురావడం విశేషమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు చిగిచెర్ల కృష్ణారెడ్డి, డాక్టర్ బోనాల మురళి, డాక్టర్ మారోజు దేవేంద్ర, డాక్టర్ మహేందర్ బర్ల, డాక్టర్ గిన్నారపు ఆదినారాయణతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఎం.ఏ తెలుగు సీనియర్ విద్యార్థి, ప్రజాపాలన పత్రిక డైరెక్టర్ తాల్క ఉషశ్రీ తమ పల్లె జీవనాధారమైన బావులపై కవిత రాసినప్పటికీ, అనివార్య కారణాల వల్ల కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. గురువులకు వందనాలు తెలియజేస్తూ మిత్రులకు శుభాకాంక్షలు వం పారు. అంతకుముందు గురు సత్కార కార్యక్రమం నిర్వహించగా, అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని వేడుకను మరింత రంజుగా తీర్చిదిద్దారు

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు

యాదాద్రి భువనగిరి జిల్లా (ఇదినిజం ప్రతినిధి):ఏప్రిల్ 19: జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి మహిళా బిల్లు పై పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)పై



మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించి తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీకి మహిళా బిల్లుపై చిత్తశుద్ధి లేదని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని మహిళా వ్యతిరేక పార్టీగా చిత్రీకరిస్తూ, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుందని బీజేపీ చేస్తున్న ప్రచారం అసత్యమని ఆమె పేర్కొన్నారు. మహిళల భద్రత, గౌరవం విషయంలో బీజేపీ వైఖరి ప్రశ్నార్థకమని నీలం పద్మ అన్నారు. హత్రాస్, మణిపూర్ వంటి ఘటనల్లో మహిళలపై జరిగిన దారుణాలకు తగిన చర్యలు తీసుకోలేదని ఆమె విమర్శించారు. మహిళా సాధికారత కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే బీజేపీ, వాస్తవానికి ఆ దిశగా కట్టుబాటు చూపడం లేదని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఆమోదించినప్పటికీ, దాని అమలును ఆలస్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ఈ అంశాన్ని ముడిపెట్టి అమలు ప్రక్రియను వాయిదా వేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, శాసనసభ స్థానాల ఆధారంగానే మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ పేరుతో స్థానాల సంఖ్యను పెంచే ప్రయత్నాలు చిన్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తాయని, దేశ సమాఖ్య వ్యవస్థపై ప్రభావం చూపుతాయని నీలం పద్మ పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్న బీజేపీ తన వైఖరిని మార్చుకోవాలని, మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సాధికారతకు సంబంధించిన అంశాలను రాజకీయాల కోసం ఉపయోగిస్తే, భవిష్యత్తులో బీజేపీకి ప్రజల మద్దతు తగ్గే అవకాశం ఉందని నీలం పద్మ అభిప్రాయం వెలిబుచ్చారు.

## లి ఎస్ డబ్ల్యూ యు యూనియన్ కార్మికులు

**రాష్ట్ర అధ్యక్షులు ఎస్ బాబు డి గోపాల్ ఆధ్వర్యంలో ఎంప్లాయిస్ యూనియన్ లో చేరిన ఇబ్రహీంపట్నంఆర్ టి సి కార్మికులు**




ఇబ్రహీంపట్నం 19 (ఇదినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్. టి. సి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిదని ఇబ్రహీంపట్నం డిపోలో ఉన్న ఏఐటీయూసీ (రాబెఖ)యూనియన్ కు యూనియన్ సభ్యత్వానికి రాజీనామా చేసి కార్మికులు ముక్కుమ్మడిగా ఎంప్లాయిస్ యూనియన్లో చేరడం జరిగింది ఇట్టి కార్యక్రమనికి ముఖ్య అతిధిగా రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాబు డి. గోపాల్ హాజరు కావటం జరిగింది. యాదగిరి సిహెచ్. పరమేష్ బి. అశోక్ డి. వెంకటేష్, యం. డి. తయార్, ఎస్ కె. గౌస్ పాషా, రమేష్ అంజయ్య బాలరాజ్, రవీందర్, గంగాధర్, యాదయ్య, జంగయ్య , భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వేసవిలో తగిన నీరు తీసుకోవాలి ప్రభుత్వ వైద్యులు ఎండి అనిల్ కుమార్**

మధిర రూరల్ ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి):ఎండలు రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న దశలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర ప్రభుత్వ వైద్యులు ఎండి . కనకపుడి అనిల్ కుమార్ సూచించారు. ఉ



ష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవు తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంటుందని అన్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్ల నుంచి బయటకు రావద్దని తెలిపారు. ఒకవేళ తప్పనిసరిగా వెళ్ళవలసివస్తే తలకు టోపీ, ముఖానికి రుమాలు కట్టుకోవాలని, వేసవిలో తగినంత నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. జంక్ ఫుడ్స్, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలని, వడదెబ్బ లక్షణాలైన కళ్ళు తిరగడం, వాంతులు, అలసట, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి వాటిని గుర్తించి వెంటనే వారికి ఓఆర్ఎస్ ద్రావణం ఇప్పించాలని తెలిపారు. ఆరోగ్యం మెరుగు పడకపోతే మెరుగైన చికిత్స కోసం లిమధిర ఎన్జీవోస్ కాలనీలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలనిలి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ కేంద్రాలలో ఆరోగ్య ఉప కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని ఓ ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు



మధిర రూరల్ ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి): మున్సిపాలిటీ పరిధిలో ప్రముఖ సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు వాసంశెట్టి కోటేశ్వరరావు జన్మదిన వేడుకలు ఆదివారం నాడు కలయిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు, స్నేహితులు కలిసి కోటేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన న్యాయరంగంలో ప్రదర్శిస్తున్న ప్రతిభ, సమాజ సేవలో చూపుతున్న చురుకుదనం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని విజయాలు సాధించి, సమాజానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావు, డాక్టర్ కొండలరావు, వనమా పూర్ణ, చంద్ర కోటయ్య, కాజా శ్రీనివాస్ రావు, టెంట్ శ్రీను, ప్రసాద్, లక్ష్మీనారాయణ, శేషు, అయ్యప్ప,శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు యోగా మార్గదర్శి: బాపట్ల వేదికగా రాష్ట్ర యోగా అసోసియేషన్ పిలుపు



(ఇదినిజం ప్రతినిధి):నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి వ్యక్తి సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొం దించుకో వడానికి యోగా ఒక్కటే మార్గమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా అసోసియేషన్ స్పష్టం చేసింది. బాపట్ల ఏకో హౌస్ వేదికగా యోగా గురువు అల్లాడి రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం వక్తలు పలు కీలక విషయాలను ప్రస్తావించారు. యోగ గురువు అల్లాడి రవికుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనలో యోగా సాధకుల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ చైర్మన్ కల్లం హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక, మానసిక వికాసానికి యోగా తోడ్పడుతుందని, ప్రభుత్వం, అసోసియేషన్ సమన్వయంతో యోగాను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ఇండియా యోగా ఫెడరేషన్ సహకారంతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షుడు కోన కృష్ణదేవరాయలు ఈ సందర్భంగా వివరించారు.

అనంతరం బాపట్ల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులుగా కల్లం హరినాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అల్లాడి రవికుమార్, ఉపాధ్యక్షులుగా గురజాల శ్రీనివాసరావు లు ఎన్నికయ్యారు. అలాగే కోఆర్డినేటర్‌గా శివన్నారాయణ, జాయింట్ సెక్రటరీగా ఎం. సూరిబాబు, ట్రెజరర్‌గా కర్పూరపు మంజులతతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె. సాంబశివరావు, సిహెచ్. కేశవులు, కె. లక్ష్మణరావు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర విజయవంతానికి కృషి చేసిన మాస్టర్ ట్రైనర్లను, జిల్లా యోగా అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులను అభినందించారు. వివేక సర్వీస్ సొసైటీ, జన విజ్ఞాన వేదిక,

ఘంటసాల జాతీయ వేదిక, బ్రహ్మకుమారీస్ వంటి వివిధ సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు.

## ఇది రైతుల ప్రభుత్వం ధైర్యంగా ఉండండి మొక్కజొన్నను కొనుగోలు చేసేది మా ప్రభుత్వం మార్కెట్ యార్డ్ చైర్మన్



ఎర్రుపాలెం ఏప్రిల్ 19(ఇదినిజం ప్రతినిధి): మండలంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు , మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు తలపురెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఎర్రుపాలెం మండలం పరిధిలో పలు గ్రామాల్లో మొక్కజొన్న కల్లాల వద్దకు వెళ్లి రైతులతో నేరుగా కలిసి రైతులకు ఆర్థికలబ్ధి చేకూర్చే విధంగా ప్రజా ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు చొరవతో మొక్కజొన్న పంటకు మంచి గిట్టుబాటు ధర కల్పించి అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని తెలియజేశారు. తక్కువ ధర కి మొక్కజొన్నలు దళారులకు అమ్ముకోవద్దని ప్రభుత్వం మంచి ధర కల్పిస్తూ అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని రైతులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో లిమండల పార్టీ ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యెన్నం పిచ్చిరెడ్డి, గుడేటి బాబురావు ,ఆత్మ కమిటీ డైరెక్టర్లు కంచర్ల వెంకట నరసయ్య, షేక్ ఇస్మాయిల్, చెప్పకట్లపాలెం సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డిలి, రైతులు తదితరులు పాల్గొన్నారు

## వడదెబ్బకు ఒకరు మృతి



మధిర రూరల్ ఏప్రిల్ 19(ఇదినిజం ప్రతినిధి); నియోజవర్గ పరిధిలోచింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో వడదెబ్బతో షేక్ మీరా 42అనే వ్యక్తి మృతి పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటి వచ్చే సమయంలో దారి మధ్యలో అస్వస్థతకు గురై మృతి చెందారు

## రెండు టిప్పర్ లు సీజ్



ఎర్రుపాలెం ఏప్రిల్ 19 ((ఇదినిజం ప్రతినిధి):ఎర్రుపాలెం మండలం పరిధిలో మామునూరు రెవిన్యూ పరిధిలోని నరసింహాపురం లో వున్న మట్టి గుట్ట నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తోలకం చేస్తున్న 2 ట్రిప్పర్ లను తహసీల్దార్ ఉషాశారద జిపిఓ లను తీసుకొని ట్రిప్పర్ లను పట్టుకొని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పజెప్పినట్లు తాసిల్దార్ ఉషా శారద తెలిపారు

## వేసవిలో దాహార్తి తీర్చేందుకు నగరంలో పలు చలివేంద్రాల ఏర్పాటు

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 19,(ఇదినిజం ప్రతినిధి):వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంచిర్యాల పట్టణంలో పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సహకారంతో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు బస్టాండ్, బెల్లంపల్లి చౌరస్తా, మార్కెట్, ఐబీ చౌరస్తా, హమాలివాడ, ఓవర్ బ్రిడ్జి, ఫ్లడ్ కాలనీ, సిసిసి కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ ప్రాంతాల్లో ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు అందించడం ముఖ్యమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య–మహేష్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మధుమేహం ఉన్నవారు పుచ్చకాయ తినవచ్చా?



వేసవిలో పుచ్చకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పుచ్చకాయలో సుమారు 90% నీరు ఉంటుంది. ఇది వేసవిలో శరీరానికి అవసరమైన తేమను అందించి, డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. దీనిలోని గుణాలు శరీర వేడిని తగ్గించి, ఎండల నుండి ఉపశమనం కలిగిస్తాయి. ఇది అలసటను తగ్గించి, శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఇందులో విటమిన్-ా, సి, పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పుచ్చకాయ ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, కిడ్నీ సమస్యలు ఉన్నవారు లేదా అలర్జీ ఉన్నవారు వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది. అయితే, మధుమేహం ఉన్నవారు పుచ్చకాయ తినవచ్చా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. సహజంగా తీపి రుచి ఉన్న ఈ పండు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుందేమోనని చాలామంది భయపడుతుంటారు. అయితే నిపుణుల ప్రకారం సరైన పరిమాణంలో తీసుకుంటే పుచ్చకాయ శరీరానికి హైడ్రేషన్ అందించడమే కాకుండా కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఇస్తుంది. అయితే.. దీనిని ఎలా, ఎంత పరిమాణంలో తినాలి అనే విషయం తెలుసుకోవడం చాలా ముఖ్యం. **మధుమేహులు పుచ్చకాయ తినవచ్చా?** పుచ్చకాయ గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉన్నప్పటికీ, గ్లైసెమిక్ లోడ్ తక్కువగా ఉంటుంది. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను మితంగా (చిన్న కప్పు పరిమాణంలో) తినవచ్చు. అయితే పుచ్చకాయ రసం తాగడం మంచిది కాదు, ఎందుకంటే అది రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా పెంచవచ్చు. మధుమేహం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీన్ని మితంగా తీసుకోవడం మంచిది. అవసరమైతే వైద్యుడి సలహా తీసుకోవడం ఉత్తమం.

## కాల్షియం సప్లిమెంట్లు తీసుకున్నా.. పనిచేయకపోవడానికి కారణాలివే..



చాలా మంది శరీరంలో కాల్షియం లోపం ఉందని భావించి కాల్షియం సప్లిమెంట్లు తీసుకోవడం ప్రారంభిస్తారు. అయితే వాటిని తీసుకున్నప్పటికీ ఎముకల నొప్పి, బలహీనత తగ్గకపోవడం చాలా మందికి కనిపించే సమస్య. దీనికి అనేక కారణాలు ఉండవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎముకల ఆరోగ్యానికి కాల్షియం ముఖ్యమైన పోషకం అయినప్పటికీ, కేవలం కాల్షియం మాత్రమే సరిపోదు. ఎముకల ఆరోగ్యం అనేక పోషకాలు, జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది. అందుకే సప్లిమెంట్లు తీసుకున్నా కొంతమందికి ఉపశమనం లభించకపోవచ్చు.వైద్య నిపుణుల ప్రకారం, దీనికి ముఖ్యమైన కారణం శరీరం కాల్షియంను సరిగా గ్రహించలేకపోవడం. అలాగే విటమిన్ ఞ, మెగ్నీషియం, విటమిన్ ఖ2 వంటి పోషకాల లోపం కూడా ఎముకల బలహీనతకు కారణమవుతుంది. ఈ పోషకాలు కాల్షియంను ఎముకల్లోకి చేరేందుకు సహాయపడతాయి. అలాగే సరైన ఆహారం లేకపోవడం, సూర్యరశ్మి తక్కువగా తగలడం, శారీరక వ్యాయామం లేకపోవడం కూడా ఎముకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. వయస్సు పెరగడం, మహిళల్లో హార్మోన్ల మార్పులు కూడా ఈ సమస్యను పెంచుతాయి.

**ఎలా నివారించాలి?**

ఎముకలను బలంగా ఉంచుకోవాలంటే కేవలం కాల్షియం సప్లిమెంట్లు మాత్రమే కాకుండా సమతుల్య ఆహారం తీసుకోవాలి. విటమిన్ ఞ కోసం ప్రతిరోజూ కొంతసేపు ఎండలో ఉండడం మంచిది. అలాగే నడక, తేలికపాటి వ్యాయామం ఎముకలను బలపరుస్తాయి. అధిక ఉప్పు, కాఫీ, ధూమపానం వంటి అలవాట్లను తగ్గించడం కూడా అవసరం. పాలు, ఆకుకూరలు, పప్పులు వంటి పోషకాహారం తీసుకోవడం ఎముకల ఆరోగ్యానికి సహాయపడుతుంది.

**ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం**

ఎముకల ఆరోగ్యానికి సరైన జీవనశైలి చాలా ముఖ్యం. సమయానికి భోజనం చేయడం, తగినంత నిద్రపోవడం, చురుకుగా ఉండటం వంటివి ఎముకలను బలంగా ఉంచుతాయి. దీర్ఘకాలంలో చిన్న చిన్న అలవాట్ల మార్పులే పెద్ద ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి.

## రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ జవాన్ మృతి




ఎర్రుపాలెం ఏప్రిల్ 19 (ఇదినిజం ప్రతినిధి):ఎర్రుపాలెం మండల పరిధిలో బనిగండ్లపాడు గ్రామానికి చెందిన.నంద్రు సుధాకర్ 48 సంవత్సరాలురిటైర్ ఆర్మీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు బుచ్చిరెడ్డిపాలెం వైపు నుండి బనిగండ్లపాడు గ్రామానికి చెందిన బలుసు పార్టీ ఆనంద్ రావు రిక్షా పైన చెక్క మొద్దులు తీసుకొని వస్తుండగా సుధాకర్ బనిగండ్లపాడు గ్రామం నుండి మైలవరం వైపు వెళ్తుండగా బనిగండ్లపాడు గ్రామ సమీపంలో రిక్షా పై ఉన్న మొద్దులు తగిలి అక్కడకక్కడే మరణించడం. జరిగింది ఆయనకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు

## అందరినీ అనుమానించడం, మతిమరుపు ప్రమాదకరమా?



డిమెన్షియా అనేది మెదడుకు సంబంధించిన వ్యాధుల సమూహం. ఇది క్రమంగా జ్ఞాపకశక్తిని, ఆలోచనా శక్తిని, రోజువారీ పనులు చేసే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. మెదడు కణాలు దెబ్బతినడం వల్ల ఈ సమస్య నెమ్మదిగా పెరుగుతుంది. దీని వల్ల వ్యక్తి ఆలోచించడం, గుర్తుంచుకోవడం, పనులు చేయడం కష్టమవుతుంది.డిమెన్షియాకు ప్రధాన కారణం అల్జీమర్స్ వ్యాధి. ఇది వృద్ధాప్యంలో వచ్చే సాధారణ సమస్య కాదు. 65 ఏళ్లు పైబడిన వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే ప్రారంభ లక్షణాలను ముందుగానే గుర్తించడం చాలా ముఖ్యం.

**డిమెన్షియా లక్షణాలు**

**ప్రారంభ దశలో కనిపించే లక్షణాలు ఇవి:**

ఇటీవల జరిగిన విషయాలు మరచిపోవడం రోజువారీ పనులు చేయడంలో ఇబ్బందిపేర్లు, పదాలు గుర్తు రావడంలో కష్టం మానసిక స్థితిలో ఆకస్మిక మార్పులు జ్ఞాపకశక్తి తగ్గిపోవడం

సమస్యలను పరిష్కరించడంలో ఇబ్బంది ప్రణాళికలు వేసుకోవడంలో సమస్యలు మానసిక మార్పులు డిప్రెషన్ అనవసర అనుమానం ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం, డిమెన్షియా లక్షణాలు వ్యక్తి నుంచి వ్యక్తికి మారవచ్చు. ఇవి ఇతర వ్యాధుల వల్ల కూడా రావచ్చు. కాబట్టి స్వయంగా నిర్ధారణ చేసుకోకుండా వైద్యులను సంప్రదించడం మంచిది.

**ప్రమాదాన్ని పెంచే కారణాలు**

వయస్సు (65 పైబడిన వారు) అధిక రక్తపోటు మధుమేహం ఊబకాయం ధూమపానం అధిక మద్యం సేవించడం వ్యాయామం చేయకపోవడం సామాజికంగా ఒంటరిగా ఉండటం

డిమెన్షియా కేవలం మతిమరుపు మాత్రమే కాదు. ఇది మెదడు పనితీరును దెబ్బతీసే తీవ్రమైన వ్యాధి. ఇది వ్యక్తితో పాటు వారి కుటుంబ సభ్యులు, సంరక్షకులపై కూడా ప్రభావం చూపుతుంది. కాబట్టి ప్రారంభ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవడం అవసరం

స్పెషల్ స్టోరీ



# ముందుకు.. సాగేదెలా?

## సంక్షోభంలో వ్యవసాయ రంగం

- కష్టాల కడలిలో ఖరీఫ్
- నైరుతీ రుతుపవనాల మందగమనం
- అనుకున్నంత స్థాయిలో లేని వర్షపాతం
- యుద్ధం దెబ్బతో ఎరువుల కొరత
- సాగునీటికీ తప్పని ఇబ్బందులు

భారత వ్యవసాయ రంగం ప్రస్తుతం మునుపెన్నడూ లేని సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అంచనాలకు తగ్గట్టుగా కురవని వర్షాలు, పశ్చిమ ఆసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు వెరసి.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కుంగదీసే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాలు మరింత ఆందోళనను పెంచుతున్నాయి. 2026 నైరుతి రుతు పవనాలపై ఐఎండీ విడుదల చేసిన తొలి దీర్ఘకాలిక అంచనా షాకింగ్ వివరాలను వెల్లడించింది. ఈ ఏడాది వర్షపాతం దీర్ఘకాల సగటులో కేవలం 92 శాతంగానే నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గత 25 ఏళ్లలో ఇంత తక్కువ స్థాయిలో ప్రారంభ అంచనా వెలువడటం ఇదే తొలిసారి. రెండేళ్లుగా సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసిన నేపథ్యంలో, ఈ ఏడాది అంచనా వ్యవసాయ రంగానికి గట్టి ఎదురుదెబ్బగా పరిణమించేలా ఉంది.

(ఇదినిజం ప్రతినిధి):

### వ్యవసాయానికి తప్పని యుద్ధం సెగ

ప్రకృతి కన్నెర్ర చేయడమే కాకుండా, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు కూడా వ్యవసాయ ఖర్చులను పెంచేలా ఉన్నాయి. పశ్చిమ ఆసియాలో సాగుతున్న సంఘర్షణల వల్ల గ్యాస్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఎరువులు, పురుగుల మందుల తయారీలో గ్యాస్ అత్యంత కీలకం. యుద్ధం కారణంగా వీటి ధరలు పెరగడం లేదా లభ్యత తగ్గడం వల్ల రైతుపై ఆర్థిక భారం మరింత పెరగనుంది. మంచి పంట పండాలంటే కేవలం నీరు ఉంటే సరిపోదు, సరసమైన ధరకే ఎరువులు దొరకాలి. కానీ ఇప్పుడు ఆ రెండు అంశాలూ అనిశ్చితిలో ఉన్నాయి.



### మే నెలపైనే ఆశలు

ప్రస్తుతానికి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, మే చివరిలో ఐఎండీ విడుదల చేసే సవరించిన నివేదిక కోసం నిపుణులు వేచి చూస్తున్నారు. గతంలో తొలి అంచనాలకు, వాస్తవ వర్షపాతానికి మధ్య వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, ఆధునిక సాంకేతికత వల్ల ఇప్పుడు ఆ తేడా తగ్గుతోంది. సగటున 87 సెం.మీ. కురవాల్సిన వర్షం ఈసారి 80 సెం.మీకే పరిమితమైతే, అది దేశ జీడీపీ గణాంకాలపై, గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఉద్యానవన పంటలు, పొగాకు, రబ్బరు వంటి వాణిజ్య పంటలు కూడా ఈ ప్రభావాన్ని చవిచూడనున్నాయి.

### ఖరీఫ్‌కు వాన గండం..

రుతుపవనాల పనితీరుకు, వ్యవసాయ వృద్ధికి విడదీయలేని సంబంధం ఉంది. ముఖ్యంగా ఖరీఫ్ దిగుబడులకు, వర్షపాతానికి మధ్య 0.64 సంబంధిత గుణకం ఉంది. అంటే, వర్షం తగ్గితే ఖరీఫ్ పంటలు కుదేలవడం ఖాయం. ప్రస్తుతం దేశంలో కేవలం 50 నుంచి 60 శాతం భూమికి మాత్రమే నీటిపారుదల వసతి ఉంది. మిగిలిన సగం సాగు పూర్తిగా వరుణుడి కరుణపైనే ఆధారపడి ఉంది. వర్షపాతం 96 శాతం కంటే తక్కువ ఉంటే వ్యవసాయ వృద్ధి రేటు గణనీయంగా పడిపోతుందని చారిత్రక డేటా చెబుతోంది.



# బాబ్ అల్ మాండెబ్‌ను మూసేస్తాం!

## హెచ్చరించిన హౌతీలు

- మరో కీలక జలసంధికి ముప్పు
- ఎర్ర సముద్రంలో ఈ జలసంధి కీలకం
- అంతర్జాతీయ వాణిజ్యంలో 12శాతం రవాణా ఇక్కడి నుంచే
- శాంతికి విఘాతం కలిగించొద్దని అమెరికాకు అల్టిమేటం
- తీవ్ర హెచ్చరికలు చేసిన హౌతీ ప్రభుత్వ విదేశాంగ శాఖ

అమెరికా-ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో రవాణాలో కీలకమైన జల సంధి హార్మూజ్‌ను ఇరాన్ మూసివేయడంతో చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభం నెలకొంది. ఇప్పుడు సూయజ్ కెనాల్‌కు వెళ్లే మార్గంలోని మరో జలసంధిని మూసివేస్తామని యెమెన్‌లోని హౌతీలు హెచ్చరించారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగే చర్యలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొనసాగిస్తే తాము బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించారు. ఒక్కసారి దాన్ని మూసేస్తే.. తిరిగి తెరిపించడం ప్రపంచంలోని ఏ ఒక్కరికీ సాధ్యం కాదని హౌతీ ప్రభుత్వ విదేశాంగశాఖ ఉప మంత్రి హుస్సేన్ పేర్కొన్నారు.

### శాంతికి విఘాతం కలిగిస్తే అంతే..

ప్రపంచ శాంతికి ఆటంకం కలిగించే అన్ని చర్యలను ట్రంప్ ఆపేయాలని హౌతీలు హెచ్చరించారు. ఈ విధ్వంసం నుంచి వెనక్కి మళ్లాలని అమెరికాకు సహకరించే దేశాలకు సూచించారు. అదే అందరికీ శ్రేయస్కరమన్నారు. మరోవైపు ఇజ్రాయెల్‌తో చేసుకున్న ఏకపక్ష కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు అవమానకరమని హెజ్‌బొల్లా సెక్రటరీజనరల్ నయీమ్ అభివర్ణించారు. ఏకపక్ష కాల్పుల విరమణకు తమ బృందం కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదన్నారు. 2024లో ఇదే విధంగా ఆ దేశాన్ని నమ్మితే కాల్పుల విరమణ అమల్లో ఉన్న సమయంలోనే పౌరులపై పెద్ద ఎత్తున దాడి చేసిందని గుర్తు చేశారు.

### మాండెబ్ జలసంధి ప్రత్యేకత ఇదే..

యెమన్, జిబౌటి మధ్య ఈ జల సంధి ఉంది.. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక మార్గం. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌కు మధ్య ద్వారంలా ఇది ఉంటుంది. దీని వెడల్పు దాదాపు 30 కి.మీ. మాత్రమే. ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకలకు ఇది చాలా కీలక మార్గం. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో 1012 శాతం దీని ద్వారానే పయనిస్తోంది. ప్రధాన మార్కెట్ల మధ్య ఎల్‌ఎన్‌జీ, తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా ₹93.95 లక్షల కోట్ల విలువైన సరకులు ఈ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా.



# కీవ్‌లో నరమేధం

ఆగంతకుడి దాడిలో ఆరుగురు పౌరుల మృతి

- నిందితుడిని హతమార్చిన పోలీసులు
- ఘటనను ఉగ్రవాద చర్యగా ప్రకటించిన ఉక్రెయిన్




ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో మరోసారి రక్తపాతం జరిగింది. ఆగంతకుడి కాల్పుల ఘటనలో ఆరుగురు మరణించగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. నగరంలోని హోలోసీవ్స్కీ జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. 58 ఏళ్ల నిందితుడు తొలుత తన అపార్ట్‌మెంట్‌కు నిప్పంటించాడు. ఆ తర్వాత ఆటోమేటిక్ తుపాకీతో వీధుల్లోకి వచ్చి కనిపించిన వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ దాడిలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అనంతరం నిందితుడు సమీపంలోని ఓ సూపర్ మార్కెట్‌లోకి ప్రవేశించి, అక్కడున్న వారిని బందీలుగా చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడితో దాదాపు 40 నిమిషాల పాటు చర్చలు జరిపారు. అయితే, చర్చలు విఫలం కావడంతో పాటు లోపల బందీగా ఉన్న ఒకరిని అతను కాల్చి చంపడంతో స్పెషల్ ఫోర్స్ పోలీసులు లోపలికి ప్రవేశించి నిందితుడిని హతమార్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో మహిళ మృతి చెందడంతో మొత్తం మృతుల సంఖ్య ఆరుకు చేరింది.

### కీవ్‌లో భద్రత కట్టుదిట్టం

ఈ ఘటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. నిందితుడు రష్యాలోని మాస్కోలో జన్మించాడని, గతంలో నేర చరిత్ర ఉందని తెలిపారు. ఆశ్చర్యకరంగా, అతని వద్ద తుపాకీకి లైసెన్స్ కూడా ఉందని వెల్లడించారు. గాయపడిన వారిలో ఒక చిన్నారి కూడా ఉందని మేయర్ విటాలీ క్లిట్ష్కో తెలిపారు. ఉక్రెయిన్ భద్రతా సంస్థ ఈ దాడిని ఉగ్రవాద చర్యగా నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ప్రస్తుతం కీవ్ నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# టీవీకే అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

## స్వతంత్ర అభ్యర్థికి విజయ్ మద్దతు

- ప్రేమ్‌కుమార్ తన అభిమాన సంఘం మాజీ నిర్వాహకుడని వెల్లడి
- 'టెలివిజన్' గుర్తుకు ఓటేసి గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- ఏఐఏడీఎంకే నేత పళనిస్వామి నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ సేలం జిల్లాలోని ఎడప్పాడి నియోజకవర్గంలో అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తమ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవడంతో ఒక స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ప్రకటించింది. ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎడప్పాడి నుంచి పోటీ చేసేందుకు టీవీకే తరఫున దాఖలైన నామినేషన్‌ను అధికారులు పరిశీలనలో తిరస్కరించారు. ఈ పరిణామంతో పార్టీ శ్రేణులు నిరాశలో ఉన్న తరుణంలో అధ్యక్షుడు విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇదే నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రేమ్‌కుమార్‌కు పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ప్రేమ్‌కుమార్ తన చిరకాల మిత్రుడని, అభిమాన సంఘం మాజీ నిర్వాహకుడని, సోదర సమానుడని విజయ్ పేర్కొన్నారు.

### ప్రేమ్‌కుమార్‌కు అండగా నిలవాలని..

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ్‌కుమార్‌కు అండగా నిలవాలని పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఎడప్పాడిలోని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు, ఓటర్లు ప్రేమ్‌కుమార్‌కు కేటాయించిన 'టెలివిజన్ సెట్' గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు. బ్యాలెట్‌లోని గుర్తును, దాని సీరియల్ నంబర్‌ను గుర్తించి ఓటు వేయాలని కోరారు. "మన అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురైనప్పటికీ, ప్రేమ్‌కుమార్‌ను మన ప్రతినిధిగానే భావిస్తున్నాం. ఆయన గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని విజయ్ తన సందేశంలో పేర్కొన్నారు. పార్టీ ఎదుగుదలను అడ్డుకోవాలని చూస్తున్న వారికి ప్రేమ్‌కుమార్ గెలుపు ఒక గుణపాఠం అవుతుందని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఏఐఏడీఎంకే సీనియర్ నేత ఎడప్పాడి కె. పళనిస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో టీవీకే మద్దతుతో బరిలో నిలిచిన స్వతంత్ర అభ్యర్థి కారణంగా పోటీ మరింత ఆసక్తికరంగా మారింది.

